# సహజాతాలూ- సరిహద్దులూ

కాశీభట్ల వేణుగోపాల్

**• చితకిపోయిన ఆకాశం సాయంత్రపు వీధుల్లో చెల్లా చెదురుగా పడివుంది..**

**వెలుగుల తునకల్నీ నీడల నిజాల్నీ దాటుకుంటూ నడుస్తున్నా... ఈ అసహ్య రహస్యం యెవరికి చెప్పనూ? ఇటువంటి అసహ్య రహస్యం మరణయాతన పడుతోంటే... ఈ పాడు ప్రపంచపు చెవులు నిక్కబొడుచుకునుంటాయి... ఆ ప్రపంచం చెవిలోకి రహస్య తరంగాలు ఒక్కటొక్కటిగా ప్రవహిస్తూంటే ప్రపంచం యెంత ఉన్మత్తత చెందుతుందో! రహస్యం పోసే నషా అది మరి....**

రహస్యమనే ఆ నషా విషాన్ని మోస్తూ నేను...

ఆ రహస్యం నా మనో ప్రాంగణాన ఓ ముళ్లసత్యాన్ని ఆవిష్కరించిన... శ్రీలత కాదూ?

కాదో అవునోగానీ ఈ నేను మాత్రం నేను కాదు... స్టీఫెన్ డెడాలస్ సీతారామరావుని...'దయానిధి' చొక్కా తొడుక్కుని 'రంధి' భంద్రం పేంటు వేసుకుని... నానా వేషాల నేను కాని నేనుని అవునవును.... ఆ అసహ్యాన్ని, పుష్పించిన నా పాపసూనాల్నీ మాలగా ధరించిన అభిశప్త మాయా గంధర్వ దొంగని...

నిజమే నిన్నటి ఆ క్షణం వరకూ అత్యంత నిర్మలుడినే... నేనే...


సాయంత్రం పూర్తిగా జీర్ణావస్థకు చేరుకుంది. బహుళ పక్షపురాత్రి, ఇనోదయానికి ముందే నల్లటి విషాదపు నవ్వులు నవ్వుతోంది..

ఎందుకు? యెందుకు చేశానలా.. నేనెలా ప్రవర్తించగలిగానలా? 'లిబిడో' అంత తీవ్రమైనదా?

"దయచేసి విను... యేమిటిది?.. నీకు పిచ్చి పట్టిందా? ప్రేమేమిటి... నేన్నీతో... యేమిటి? అర్ధంలేని మాటలు కావూ? నిజమే ... ఈ రోజు... ఎందు...ఎందుకిలా జరిగిందో నాకే తెలీదు... నిజం చెప్తున్నా... ఆ క్షణాన... దీనంగా ... ఒంటరిగా ... దిగులుగా ఉన్న నిన్ను చూసిన క్షణాన.. .స్నేహం, జాలీ... నాలో స్త్రీ సహజమైన లాలిత్యమూ అన్నీ రూపాంతరం చెంది స్పర్శగా మారి... నన్ను తాకాను.. అక్కున చేర్చుకున్నాను... నిజమే ముద్దుకూడా పెట్టుకున్నాను... ఆ క్షణాన అది శరీరాల భాష. ఆ భాషలో మాట్లాడుతూ నాకు తెలీకుండానే నీలో సహజాతాల్ని నిద్ర లేపాను... అది చీకటి క్షణం... ఆ చీకట్లో ఎపుడూ... ఎవ్వరికీ కనబడని 'నిన్ను' చూసాను.. నిజమే ఆ తత్త్వం



ప్రాకృతికంగా జ్వలించేది... ఈ మహా ప్రకృతి నిరంతరం కొనసాగడానికి ఏర్పడ్డ ఓ సహజసూత్రం... స్త్రీ... పురుషుడూ అన్న ప్రకృతి గీచిన గీతను గుర్తు చేసావు... నేన్నీకు చెప్పాల్సిన అవసరం లేదు. మన శారీరక ధర్మాలసూత్రాన్ని



మనం విస్మరించలేమన్న నిజమది.... అన్నా... చెల్లీ అయినా... తండ్రీ కూతుళ్లైనా స్నేహితులైనా... ఎవ్వరైనా .... అందుకే ఈ నాగరక సభ్య సమాజం వివాహం అన్న ఓ వ్యవస్థనను ఏర్పరుచుకుంది...

శరీరాలకు అతీతంగా మన మనస్సులున్నా... ఏదో ఓ వికృత క్షణాన మన మనస్సులకు అతీతమై మన శరీరాలు విస్తరించిపోతాయి... దాన్ని ఇన్‌సిస్ట్ అనూ క్విడిపస్ కాంప్లెక్స్ అనూ ఎలక్ట్రా కాంప్లెక్స్ అననూ... స్త్రీ స్త్రీయే... పురుషుడు పురుషుడే అలాగని... దీని గురించి ఆలోచిస్తూ జీవితాన్ని హీనం చేసుకుని నాశనం కానవసరం లేదు. చదువుకున్నవాడివి.. మా ఇద్దరికీ అత్యంత ప్రీతి పాత్రుడివే... రాజు రాజు నా భర్త మాత్రమే కాదు... నా సర్వస్వం... ప్లీజ్ ఫర్గెట్ ఎవ్వరీ థింగ్!"

వికసించీ వికసించని పువ్వు.. పగిలిన చీకటి వెనకనే వెల్తురై ఆమె ఉన్మిషిస్తోంది...

నా కళ్లు అశ్రువులు పూసాయి...

ఓ వెలుతురుపువ్వు రేకులు రాలిపోయాయి.

ఒక అనాది గీతం... దానికో పురాతన రాగం...

ఇపుడు ఈ క్షణాన దోసిళ్లకొద్దీ నిశ్శబ్దాన్ని తాగి ఆ పాట మౌనమైంది... ఆకాశమైన ఆవేశం... శూన్యం...

కొన్నికోట్ల తటిత్తుల విద్యుత్తును చప్పరించేసిన ఆ శరీరాన్ని స్పృసించి... నేను... కరిగిపోయి... మరిగిపోయి... ఇగిరిపోయి ఆవిరై కదిలిపోయి... శూన్యమై.. హీనమై... హేయమై... నేనే...నేనే... అయ్యో! ఈ గిల్ట్ నాలో ఇక పోదుగాక పోదు...

● ● ●

రాజా, శ్రీలతా ఇద్దరూ ఈ వంటరి జీవితానికి స్నేహితులు... వట్టి స్నేహితులే కాదు అన్నీనూ... వాళ్లిద్దరి వివాహమై పదమూడేళ్లైంది కూతురు భావన... వాళ్ల ఇంట్లోనే ఓ గదిలో నా నివాసం... నా దారి నాది... వాళ్ల దారి వాళ్లది.. శనివారం మాత్రం రెండు దార్లూ కలుస్తాయి...

నేనూ రాజా స్వర్ణజల కలశాన్ని తెచ్చుకుని ఆకాశాన్ని జయించిన వాళ్లలా కూచుంటాం...

ఖచ్చితంగా 'కళావతి'లో నేను 'రతిసుఖసారే' పాడాలి. శ్రీ 'చాంద్ ఫిర్ నికలా మగర్ తుమ్ న ఆయే' పాడుతుంది. రాజు తబలా వాయిస్తాడు... ఆదివారం మొదలు కావాల్సిందే అందంగా హాయిగా...

అట్లా సాగిపోతూన్న మా జీవితాల్లో ఆ రాత్రి... ఆ రాత్రి ప్రవేశించి 'నన్ను' హత్య చేసింది.

'ఆ' క్షణానికి ముందే శ్రీలత అడిగింది... "కొత్తపేటలో మర్డరటగా. నేన్నిన్ను చంపనా తూటాతో కాదు పాటతో" అని.

నిజంగానే నా హత్య జరిగింది... ఓ స్నేహితుడూ.. మనిషీ మరణించి..

ఓ పశువు జన్మించింది.

ప్రజలూ, సమాజం.. నీతీ... నియమం అన్నీ ఆ పశువు నాకేసింది... అది కలే కాకూడదా? నా అంతశ్చేతనలో ఉద్భవించిన ఓ వికృత స్వప్నఖండం మాత్రమే అవకూడదా?

కాదు... అవదు... సత్యానికి యెంత శక్తి!

మౌనంగా ఆ సత్యభారాన్ని మోస్తూ బజార్లో నడుస్తున్నా... జనాలు యెందరెందరో.. యెవరెవ్వరో... వీళ్లందర్లోను ఇలాంటి చీకటి క్షణాలుండవా?

నేను ఆ పని చేయకపోయినా చేయాలన్న ఆ ఆలోచన కలగడమే ఇంత ఖేదాన్ని కలిగిస్తోందే.. ఎంత స్వచ్ఛంగా ..నిర్మలంగా నిర్భయంగా నా లోపలి పశువు కొమ్ములు పట్టుకు వంచేసింది శ్రీ?

దార్లో ఎవరెవరో పలకరిస్తున్నారు... నడుస్తూ నడుస్తూ.. అలా 'బ్లూ డైమండ్' దగ్గరి కొచ్చేశా... ఇప్పట్లో ఇంటికెళ్ల లేననుకుని బాగా పొద్దుపోయేవరకూ ఇక్కడే అనుకుని... ఆ చీకటి గుయ్యారంలోకి...

● ● ●

గుడ్డి వెలుగులో... మెట్లెక్కుతూ...

ఆహా! మంత్రనగరాని విచిత్ర కాంతి ద్వారాలు అనుకుంటూ లోపలికి...

బోనులాంటి సీసాల ఖైదులో తలమీద విద్యుత్పిండం వ్రేలాడ్తూ... బార్ ఓనర్ రెడ్డి... విష్ చేసి "పైకి టెరేస్ మీదకి వెళ్లండి సార్... డిస్టర్బెన్స్ ఉండదు" అన్నాడు.. నషాని కరెన్సీగా మారుస్తూ..

మళ్లీ మెట్లు... ఉల్లిపాయలూ... బియ్యపు బస్తాలూ, విరిగిన కుర్చీలూ దాటుకుని... పైన డాబామీద వెలసిల్లిన ఇంకో చీకటి నాగరకతలో నా పునర్జన్మ... యెన్ని చావులూ? యెన్నెన్ని పుట్టుకలు?

రెండు నిముషాల్లో ప్రతీసారీలాగే మొన చిట్లిన గ్లాసూ విస్కీ... జిడ్డు పర్చుకున్న ప్లేట్లో పల్లీల్తో బేరరనబడే కౌమార్యం వాడి పేరేదైతేనేం ప్రత్యక్షమయ్యాడు..

సంధ్య కాంతుల్లాంటి స్వర్ణజలాలూ... నల్లటి చల్లటి చీకటి నీళ్లూ కలిసి.. కలగలిసి.. వాస్తవాన్నించీ నన్ను తరిమే ప్రయత్నానికి పూనుకున్నాయి... ఓ అయిదు నిముషాలు



## గోవింద 'పాప్' హీరోట!

ఇప్పుడిక హీరోగా వచ్చిన కీర్తి చాలలేదనుకుంటున్నాడేమో, గోవింద పాడటంకూడా మొదలెట్టాడు. అయినా గోవింద సినిమాలంటే మ్యాజిక్కే జరుగుతుందని అభిమానులంటారు. మరిక్కడ కూడా అదే జరిగింది! ఇటీవలే తన సోదరి రాసిన పాటలు గోవింద పాడి పాప్ ఆల్బమ్‌గా విడుదల చేశాడు. పాటలు రాయటమేకాక ఆవిడ వాటికి సంగీతం కూడా సమకూర్చిందిట. గోవింద అభిమానుల సంగతి చెప్పనే అక్కర్లేదు! ది క్లబ్‌లో జరిగిన ఈ సందడికి వచ్చి దాన్ని ఆవిష్కరించిందెవరో తెలుసా? 'లవ్లీ లుకింగ్ బ్యూటీ' శ్రీదేవి తన భర్త బోనీకపూర్‌తో సహా వచ్చి, ఈ ఆల్బమ్‌ను విడుదల చేసింది. దీన్నే 'సూపర్ షో' అంటారని జనమంతా అనుకున్నారట! మరి మనకో కొత్త గాయకుడు లభించినట్లేనా? ఇందులోనూ టాప్ అనిపించుకుంటే తప్ప వదలడేమో చూడాలి!

ఎం.ఏ.

గడిచాయో లేదో.. మరొగ్లాసూ రావుగాడూ ప్రత్యక్షం...

ఈ క్షణాన వీడెందుకొచ్చాడూ... స్పృహ కోల్పోయి నా తప్పును వీడిముందు విప్పేస్తానేమో.. అయినా పళ్లికిలించి వాణ్ని పలకరించిరిదింకో పశువు...

రావుగాడు విస్కీ గురించి మాట్లడాడు... బిజినెస్ గురించి కాస్సేపు... నా కాలేజ్ గురించి రెండు మాటలూ... మధ్యలో పల్లీలమీదా, గోడమీది బల్లుల మీదా ఇంకొన్ని నామీదా విసిరేసి తన్ను.. తాను రెండు పెగ్గుల విస్కీతో తడుపుకుని.. "చెప్పు ప్రొఫెసర్... డల్‌గా ఉన్నావేమిటి కథ?" అన్నాడు...

యేం చెప్పను? యెలా చెప్పనూ? ఆ బాధ... ఆ బరువైన బాధ యెట్లా చెప్పాలి? నాలో ఆలోచన నశించి శరీరం నా మనసును తన అధీనంలోకి తీసుకున్న ఆ క్షణం గురించి యెట్లా చెప్పను. అందునా వీడికి.. చిరిగిన బట్టల్లోంచీ ఛిద్రమైన సౌందర్య శకలాలు చూసే వెధవకి... అయినా...

నే పరిషించి సేవించిన మంత్రజల మహిమో... మనసులో బరువు దింపుకుందుకో అన్యాపదేశంగా... ఆ తప్పును జనరలైజ్ చేసి మాట్లాడాను. అంతే... వాడు చెలరేగిపోయాడు.. పెళ్లైన స్త్రీతో అటువంటి ఆలోచనే మహాపాతకమన్నాడు... సామాజిక న్యాయాలకు అది నిప్పు పెట్టడమన్నాడు... నాలాంటి వాళ్ల మానసికంగా ఎదగాలన్నాడు. ఇంకా యేమేమో అని ఓ మూడు పెగ్గులు తాగి ఓటుగాలిలా వెళ్లిపోయాడు.. "ఛీః"!

• • •

నాకు తెలుసు ఈ మానసిక స్థితిలో కాలేజీకి వెళ్లలేను. శ్రీలత మొహమూ చూళ్లేను.. భావన వచ్చి పలకరించినా ముభావంగా మాట్లాడి ఆ పిల్లను పంపించేసాను... వాళ్ల వాటాలోకి తెర్చుకునే నాగది తలుపు మూసేసాను... ఆ క్షణం నించీ నన్ను తప్పించే తలుపుంటే బావుణ్ను...

నా టేబిల్మీద ముళ్ల క్యాక్టస్ అందం... ప్లాస్టిక్ వేజ్‌లోంచి పార్లిపోతూన్న సింథటిక్ పువ్వుల నవ్వులూ... గవ్వలతో చేసిన గువ్వా... షిర్డీసాయి ఫోటో... అన్నీ... అన్నీ... నా తప్పుకు సాక్ష్యాలై... నన్ను వేలెత్తి చూపిస్తున్న భావన... పారిపోవాలి... పారిపోవాలి... ఎలా?

గది ఖాళీ చేసి.. ఉద్యోగానికి రాజీనామా చేసి... వెళ్లిపోనా... ఎంతదూరమెళ్లినా నా మనస్సునించీ నేను పారిపోలేనే... నన్ను తరుముతూ నా ఆలోచన నన్ను వెంటాడుతుందే...

గుమ్మంలో నీడ...

తలెత్తి చూసా.. శ్రీలత...

'గోగే' చిత్రంలా అసంబద్ధమైన రంగుల్తో గుమ్మంలో నుంచుంది... తలవంచుకుని నాలోకి నేను ఇంప్లోడ్ అవ్వగలిగితే బావుణ్ను అనుకుంటూ కుంచించుకుపోయాను...

"చూడూ!" మృదువుగా అంది. తలెత్త లేకపోయాను..

'నేన్నీకెప్పటికీ స్నేహితురాల్నే... ఆ ఒక్క సంఘటన్ను తల్చుకుని తల్చుకుని హీనమై నాశనమైపోడంలో ఔచిత్యం లేదు... అది·అతి సహజమైన చర్య... దాన్ని మనం సాంఘికులం... తప్పూ ఒప్పూ కొలతల్తో కొలుచుకుంటామంతే.. చూడిటు... ఆ రాత్రి రాజుకి జరిగింది చెప్పాను... బాధపడ్డాడు సహజంగానే... కానీ ఆవేశపడ్లేదు... విను... రేపటి మన జీవితాల్ని... మనం చెరిపేసుకోలేం మనం ముగ్గురం యెప్పట్లా స్నేహితులమే... నిజమే గిల్ట్ ఉంటుంది. ప్రతి కశ్మలానికీ పరిశుద్ధ కర్మాగారాలున్నాయి... పద.. రెండురోజులుగా మనిషి మనిషిలో లేవు... ఇంత పెరుగన్నమేనా తిందువుగానీ రా! ప్లీజ్..."

యెదురుగా మోకాళ్లమీద కూచుని అంది... తడిసిన కళ్లెత్తి ఆమెన్చూసాను. మంచు కడిగిన మందారాల కాంతి... యెంత నైర్మల్యం!

నిజమే... తప్పులు చెయ్యని మనుషులెవ్వరు? తప్పు చేసిన స్నేహితుడికి దాన్ని దిద్దుకునే అవకాశమిచ్చిన ఆ మహోన్నతుడికీ... అతని మనసును పాదరసంలా, తన హృదయపు దోసిలిలో జాగ్రత్తగా పట్టుకున్న ఎదురుగా ఉన్న ఆ దేవతకీ...,

చేతులెత్తి నమస్కరించా...

"ఛీ వూర్కో...పద అన్నం తిందువుగానీ...

"ఆః.. రాజు ఈ రోజు శనివారం కాకపోయినా శనివారమే నని నీతో చెప్పమన్నాడు"

చీకటి వెలుగుల చిక్కు సంధ్యలా కదిలిపోయింది.

చీకటి... వెలుగూ చిట్లిపోయాయి... మనసు కాస్త తేలికైంది. తడసిన రెక్కలు నెమ్మదిగా విచ్చుకుంటున్నాయి.

ఎస్... ఆలయం కోనేటి మెట్లమీద రాజూ శ్రీలు ప్రత్యూష సంధ్యలై... అందాలై ఉదయిస్తారు...

కరవీర పుష్పాలు దీర్ఘ గంభీర భావాల్తో దేవతార్చనకై కొమ్మలకి వేల్లాడ్తాయి... గన్నేరు కాలకూట విషమైనా...

పాచిపట్టినా, కోనేటి నీళ్లు పరిమళిస్తాయి... ఆలయ ప్రాంగణాన అస్తిత్వమున్నందుకు.

పవిత్రత మనస్సుల్లోంచీ.. కన్నుల్లోంచీ... భాషలోంచీ గుడి ప్రాంగణంలోని పిచ్చి మొక్కల్లోకి కూడా ప్రవహిస్తుంది.

అపుడు ఆ మొక్కలు... ఆ ఆకులు భౌతికమైన వాసనలు కోల్పోయి నైర్మల్యాన్నీ, దైవత్వాన్నీ ప్రవచిస్తాయి నాకు తెలుసు అవన్నీ తులసి దళాలౌతాయి. అవునవును.

తలసి దళాలు... ఆసిమమ్ సాంక్టమ్ దేవుడి మెళ్లో నిండైన దండలు....

■